సాక్షి సిద్దిపేట

గురువారం । 14 । నవంబర్ । 2024

నంది విగ్రహం దుస్థితి..



కాలగర్భంలో కలిసి పోతున్న వీరగల్లు విగ్రహం







ఆదరణ కరువై..

కళా అబ్బురం.. నిర్లక్ష్యంతో దుర్భరం

చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్న రాతి శిల్ప కళా ఖండాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. పట్టించుకునే వారు లేక కళా విహీనంగా మారుతున్నాయి. మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో రాతి శిల్ప కళా సంపదకు కొదువ లేదు. కానీ, వాటికి సరైన ఆదరణ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కళా విహీనంగా మారుతున్నాయి. ఇప్పటికే అనేక విగ్రహాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కొన్ని విగ్రహాలు బయటకు కనిపిస్తున్నప్పటికీ, నాటి చరిత్రను తెలిపే ఉనికిని కోల్పోతున్నాయి. చాళుక్య కాలం నాటివిగా చెబుతున్న వీరగళ్లు, నంది, పాల రాతి శివ లింగాలు వంటి రాతి విగ్రహ కళా ఖండాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. రాతి కళా సంపదను సంరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. -మిరుదొడ్డి(దుబ్బాక)

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: ప్రజలకు న్యాయపరమైన సలహాలతో పాటు న్యాయం చేయాలనే సేవా దృక్పథం ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. ఆసక్తి ఉన్న వారు జిల్లా కోర్టు ఆవరణలో దరఖాస్తు చేసుకోవాలని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి, సెక్రటరీ స్వాతిరెడ్డి తెలిపారు. రిటైర్డ్ టీచర్లు, సీనియర్ సిటిజన్స్, అంగన్‌వాడీ వర్కర్స్, డాక్టర్లు, లా స్టూడెంట్స్, సేవా ధృక్పథం కలిగిన ఎన్‌జీవోస్ వలంటరీలుగా పనిచేసేందుకు అర్హులన్నారు. ఈ నెల 30లోగా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ అనంతరం 50 మందిని పారా వలంటరీలుగా నియమించి లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రకారం గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

స్టెనోగ్రాఫర్ కోసం..

సిద్దిపేటకమాన్: న్యాయ సేవాధికార సంస్థలో స్టెనోగ్రాఫర్ ఉద్యోగానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి బుధవారం తెలిపారు. మరిన్ని వివరాలకు కోర్టుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ఈ నెల20 వరకు నిర్వహించనున్నట్లు, జిల్లా సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, కార్యదర్శి సుధీర్‌లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయంలో జరిగే వారోత్సవాలకు కలెక్టర్ మనుచౌదరి హాజరుకానున్నట్లు తెలిపారు. వారం పాటు ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న చిత్రలేఖన పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, 16న సుడోకు, క్విజ్ పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న వ్యాస రచన పోటీలు, 19న ముగ్గుల పోటీలు, 20న విజేతలకు బహుమతుల పంపిణీ, వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. వారోత్సవాలలో ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, కవులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మా భూముల్లోంచి కాల్వ తవ్వొద్దు

గ్రామ సభలో రైతుల మొర



తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

హుస్నాబాద్‌రూరల్: మా భూముల్లోంచి కాల్వ తవ్వొద్దని రైతులు మొరపెట్టుకున్నారు. మండల పరిధిలోని మీర్జాపూర్‌లో బుధవారం రెవెన్యూ అధికారులు గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ కాల్వ భూ సేకరణ కోసం గ్రామ సభ నిర్వహించారు. కాల్వ ద్వారా పంట పొలాలకు నీళ్లు అందించడానికి ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి భూములను గుర్తించారు. ఈ క్రమంలో గ్రామాల వారీగా రెవెన్యూ అధికారులు భూ సేకరణకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. మీర్జాపూర్ రైతులు మా ఊరికి సాగు నీరు కొరత లేదని, మాకు కాలువ అవసరం లేదంటూ తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఒక్కొక్క రైతుకు ఎకరంలోపే భూములున్నాయని కాల్వ తవ్వితే ఉన్న ఆధారం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధిద్దాం

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



ఉపాధ్యాయురాలికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్ వర్క్‌షాప్‌లో డీఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ సర్టిఫికెట్లు, సైన్స్ కిట్లను అందించారు. అంతకు ముందు డీఈఓ మాట్లాడుతూ ఈ వర్క్ షాప్‌లో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో అనేక ఇన్నోవేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇవి విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సైన్స్ అకాడమీ సభ్యులు రేవతి, ఆమీర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జోజి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులు ఉండొద్దు

జెడ్పీ సీఈఓ రమేశ్



జనగామలో సర్వేను పరిశీలిస్తున్న రమేశ్

అక్కన్నపేట(హుస్నాబాద్): సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసే సమయంలో ఎన్యుమరేటర్లు తప్పులు చేయకుండా జాగ్రత్తగా ఉండాలని జెడ్పీ సీఈఓ రమేశ్ అన్నారు. అక్కన్నపేట మండలం జనగామలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబ యజమాని చెప్పిన వివరాలను మాత్రమే సర్వేలో నమోదు చేసుకోవాలని సూచించారు. బలవంతంగా ఆధారాలు చూపాలని ఒత్తిడి చేయొద్దన్నారు. ఈ సర్వే వివరాలను గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత ఎన్యుమరేటర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి జమున తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి బాటలు

మట్టి రోడ్లకు మహర్దశ

- జిల్లాలో సీఆర్ఆర్ కింద రూ.51 కోట్లు మంజూరు
- హుస్నాబాద్‌కే అధిక నిధులు
- ఈ నెల 18న పిలవనున్న టెండర్లు
- తప్పనున్న వాహనదారుల కష్టాలు



లద్దూరు నుంచి వంగపల్లి మట్టి రోడ్డు

జిల్లాలోని మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుంది. చిరు జల్లులకే బురదమయంగా మారడం.. దారి పొడవునా గుంతలతో పల్లె వాసుల కష్టాలు దూరంకానున్నాయి. గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణం (సీఆర్ఆర్) కింద మట్టి దారులను తారు రోడ్లుగా మార్చేందుకు, పలు కొత్త వంతెనల నిర్మాణం, వివిధ పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 29 పనులకు రూ.51.14కోట్లు మంజూరు అయ్యాయి.

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు అధిక నిధులు మంజూరయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 29 పనుల నిమిత్తం రూ.51.14 కోట్లు మంజూరైతే అందులో రూ.33.04 కోట్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందినవే ఉన్నాయి. సిద్దిపేట నియోజకవర్గంలోని గౌడ ఫంక్షన్ హాల్ మిగిలిన పనులకు రూ.25లక్షలు మంజూరు చేశారు. తోటపల్లి నుంచి పోసవర్లపల్లికి వంతెన నిర్మాణం కోసం రూ.1.49కోట్లు, కోహెడ మండలంలోని గోట్లమిట్ల నుంచి నారాయణపూర్‌కు వంతెనకు రూ.91.55లక్షలు, వడ్లూరు నుంచి గొల్లపల్లి మధ్యలో స్లాబ్ కల్వర్ట్ నిర్మాణం కోసం రూ.50లక్షల నిధులు మంజూరు చేశారు.

తప్పనున్న ఇబ్బందులు..

మట్టి రోడ్లు తారు రోడ్లుగా, అలాగే పలు చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టనుండటంతో వాహనదారుల ఇబ్బందులు తప్పనున్నాయి. వర్షం పడిందంటే చాలు పలు గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు అన్నీఇన్నీకావు. పలు చోట్ల లోలెవల్ వంతెనలతో వర్షకాలంలో రాకపోకలు నిలిచిపోయేవి. కొత్తగా వంతెనల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంతో ఇబ్బందులు తీరనున్నాయి. ఈ పనులు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ (పీఆర్) ఈ నెల 18వ తేదీన ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవనున్నారు. వారం రోజుల పాటు టెండర్లు స్వీకరించనున్నారు. టెండర్లు ఫైనల్ కాగానే అగ్రిమెంట్ అయ్యాక పనులు ప్రారంభం కానున్నాయి.

నిత్యం ఇబ్బందులే..



చాలా సంవత్సరాల నుంచి లద్దూరు నుంచి వంగపల్లి గ్రామానికి మట్టి రోడ్డుతో ఇబ్బంది పడుతున్నాం. పలు మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. తారు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది. తారు రోడ్డు నిర్మాణం అయితే మా ఇబ్బందులు తప్పనున్నాయి.

-వేణుగోపాల్ రెడ్డి, వాహనదారుడు, లద్దూరు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

గ్రామీణ ప్రాంతాల్లో సీఆర్ఆర్ కింద పలు పనులకు నిధులు మంజూరయ్యాయి. టెండర్లను ఆహ్వానించాం. త్వరలో పనులు పనులు ప్రారంభమవుతాయి.

-శ్రీరాములు, ఈఈ, పీఆర్

సృజనాత్మకతను వెలికి తీసేందుకే..

- విద్యార్థులకు పలు రంగాల్లో పోటీలు
- బాల సదనం నిర్వహణ ఇన్‌చార్జి రమాదేవి
- 'సాక్షి', ఎస్‌పీఎల్ ఆధ్వర్యంలో 'చిల్డ్రన్స్ డే' వేడుకలు



కొండపాకలోని బాలసదనంలో భగవద్గీత శ్లోకాలు పఠిస్తున్న విద్యార్థి ప్రభాకర్

కొండపాక(గజ్వేల్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని బాలసదనం నిర్వహణ ఇన్‌చార్జి రమాదేవి అన్నారు. కొండపాకలోని ఆనంద నిలయం ఆవరణలో కొనసాగుతున్న ఆనంద్ నిశాంత్ చారిటబుల్ ట్రస్టు బాలసదనంలో సిద్దిపేట ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్), సాక్షి మీడియా గ్రూప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 'చిల్డ్రన్స్ డే' వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన, భగవద్గీత శ్లోకాలపై పోటీలను నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ వెనిశెట్టి నిశాంత్ పేరిట బాల సదనం ఏర్పాటు చేసి 40 మంది అనాథ పిల్లలకు విద్యాబోధనతో పాటు పోషణ అందిస్తున్నామన్నారు. ప్రతీ ఏటా మండల వ్యాప్తంగా టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వాహకులు రాజమౌళి సహకారంతో నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నట్లు వివరించారు. అనాథ పిల్లల కోసం పోటీలను ఏర్పాటు చేసిన సాక్షి యాజమాన్యానికి, సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శోభారాణి, సాక్షి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిత్ర లేఖనం పోటీల్లో గీసిన బొమ్మలను చూపుతున్న అనాథ చిన్నారులు

కరెంట్ కనెక్షన్లు తొలగించొద్దు

ఏడీ, ఏఈలకు గౌరవెల్లి నిర్వాసితుల వినతి

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ విలువైన భూములు ఇచ్చి సర్వం కోల్పోయామని, ఇప్పుడేమో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామంటూ అధికారులు బెదిరిస్తున్నారని పలువురు భూ నిర్వాసితులు తెలిపారు. ఈ మేరకు బుధవారం పలువురు భూ నిర్వాసితులు విద్యుత్ శాఖ ఏడీ ఉపేంద్రం, ఏఈ ప్రకాశ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపునకు గురైన జాలుబాయితండా, చింతల్‌తండా, తిరుమల్‌తండా, బోంద్యానాయక్‌తండా, సేవ్యనాయక్‌తండా గిరిజన తండాలు ప్రస్తుతం ప్రాజెక్టులోనే నివాసం ఉంటున్నారు. ఇళ్ల స్థలాలతో పాటు తదితర వాటికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రావల్సి ఉందని, పూర్తిస్థాయిలో పరిహారం వచ్చే వరకు ఇళ్లు ఖాళీ చేసేదిలేదని చెబుతున్నారు. ఈ తరుణంలో ఇటీవల విద్యుత్‌శాఖ అధికారులు తండాలకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తామని చెబుతున్నారని, ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నీటితో నింపేవరకు ఇళ్లు ఖాళీ చేయమని అంటున్నారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు మాలోతు కనకనాయక్, భూక్య రమేష్‌నాయక్, హరిలాల్‌నాయక్ పాల్గొన్నారు.

యువతరంపైనే దేశ భవిష్యత్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి తదితరులు

- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటజోన్: నేటి యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బానిసలు కావొద్దని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అదనపు డీసీపీ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో జిల్లా యువకేంద్ర, సమగ్ర శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మాదక ద్రవ్యాలు యువత జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. మంచి నడవడికతో తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని సూచించారు. అంతకుముందు సిద్దిపేట జిల్లా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శాంతి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు, మద్యపానం, ధూమపానం వల్ల మనిషి ఎలాంటి వ్యాధులకు గురవుతారో వివరించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ, పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఆబ్కారీ శాఖ అదనపు సూపరింటెండెంట్, టూటౌన్ సీఐ ఉపేందర్, ఆబ్కారీ శాఖ ఎస్ఐ కిరణ్, నెహ్రూ యువకేంద్ర, విద్యాశాఖ అధికారులు, ప్రతినిధులు వివిధ పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 15మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.24వేలు జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

శాస్త్రీయత జోడిస్తేనే విద్యకు సాకారం

మూఢనమ్మకాలు వీడాలి

- సైన్స్ మేళాలతో విద్యార్థులకు మేలు
- సైన్స్ అవగాహన కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్తలు



సైన్స్ ఎగ్జిబిట్లను తిలకిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని, శాస్త్రీయత జోడిస్తేనే విద్యకు సాకారం అని ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ మాధవి, హైదరాబాద్ ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీహరి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సూర్య ప్రకాశ్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ అండ్ టెక్నాలజీ సొసైటీ ఫర్ ఇంట్రిగేషన్ రూరల్ డెవలప్‌మెంట్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సైన్స్‌పై అవగాహనతో పాటు ఎగ్జిబిషన్ నిర్వహించారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు 120 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రతి విషయాన్ని శాస్త్రీయతతో జోడించి చూడాలన్నారు. ప్రతి సమస్యకు సైన్స్ పరిష్కారం చూపుతుందన్నారు. ప్రపంచంలో ప్రతి నిత్యం ఎన్నో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయన్నారు. మూఢనమ్మకాలను వీడాలన్నారు. ప్రతి విద్యార్థి తమకు వచ్చిన ఆలోచనను ఆచరణాత్మకంగా అమలు చేయాలని, అపుడే వారిలో సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. ఒక విషయాన్ని చెబితే కొంత మేర మాత్రమే అర్థమవుతుందని, అదే విషయాన్ని ప్రయోగాత్మకంగా చూసినపుడు పూర్తిగా అర్థమవుతుందన్నారు. అందువల్లే ఇలాంటి అవగాహన కార్యక్రమాలు, సైన్స్ మేళాలు విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తాయన్నారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ సోసైటీ ఫర్ ఇంట్రిగేషన్ రూరల్ డెవలప్‌మెంట్ వలంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్ శ్రీనివాస్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కళ్లకు కట్టినట్టు చూపారు..



మానవ శరీరంలో ఏ అవయం ఏ విధంగా, ఎక్కడ ఉంటుందో ఈ ఎగ్జిబిట్‌లో చూపించారు. చదవడం కంటే చూడటం ద్వారా అనేక విషయాలు నేర్చుకునే అవకాశం కల్గుతుంది. మానవ శరీరం ఆకృతిలో ప్రదర్శించిన ఎగ్జిబిట్‌లో గుండె, కాలేయం, పెద్ద, చిన్న ప్రేగులు, ఏ విధంగా పని చేస్తాయో పూర్తిగా తెలిసింది. ఇంలాటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తే బాగుంటుంది.

- అజయ్, 10వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్

ఎగ్జిబిట్లతో సంపూర్ణ అవగాహన



శాస్త్రవేత్తలు రోజువారిగా మనం చేసే ప్రతి పనిలోనూ సైన్స్ ఏ విధంగా నిక్షిప్తం అయ్యి ఉంటుందో వివరించారు. మూఢనమ్మకాలను వీడాలని, సైన్స్ నమ్మాలని అవగాహన కల్పించారు. ఇక్కడ ప్రదర్శించిన అన్ని రకాల ఎగ్జిబిట్‌లు చూడగానే, ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశం ఈ విధంగా ఉంటుందా అని అనిపించింది. ఇలాంటి ఎగ్జిబిషన్‌లు ప్రతి నెలకు ఒకసారి ప్రదర్శిస్తే బాగుంటుంది.

- సారిక, 9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వింజపల్లి

వైద్యులు అందుబాటులో ఉండాలి

- రోగులకు మెరుగైన వైద్యం అందించాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్



నాసర్‌పూర పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్

సిద్దిపేటకమాన్: వైద్యులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో బుధవారం డీఎంహెచ్‌ఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాల పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. నార్మల్ డెలివరీల సంఖ్యను పెంచాలని, ప్రోగ్రాం ఆఫీసర్లు పీహెచ్‌సీలను సందర్శించి రికార్డులను పరిశీలించాలన్నారు. 30ఏళ్ల పైబడిన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి టీహబ్‌కు పంపించాలన్నారు. గర్భిణులకు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వంద శాతం అమలు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ, బస్తీ దవాఖాన తనిఖీ

సిద్దిపేట కాళ్లకుంటకాలనీలోని బస్తీ దవాఖానను, నాసర్‌పూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ బుధవారం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ పనితీరును ఆయన పరిశీలించారు. ల్యాబ్, వ్యాక్సిన్ నిల్వ ఉంచే గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పని కోసం వెళ్లి అనంతలోకాలకు

అదుపు తప్పిన బైక్.. యువకుడి మృతి


తిరుపతిరెడ్డి(ఫైల్)

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కొల్గూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్‌కు చెందిన పీ తిరుపతిరెడ్డి (38)కి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. బుధవారం తన సొంత పని నిమిత్తం బైక్‌పై గజ్వేల్‌కు వస్తున్నాడు. మార్గ మధ్యలో కొల్గూరు గ్రామ శివారు.. మలుపు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

ఇద్దరు దొంగలకు మూడేళ్ల జైలు

కొండపాక(గజ్వేల్): దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారణైన ఇద్దరు దొంగలకు 3 సంవత్సరాల జైలు శిక్షను విధిస్తూ సిద్దిపేట కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పు చెప్పారని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా బీబీనాయక్ తండాకు చెందిన రాథోడ్ అలియాస్ నరేశ్, బలరాం కొంతకాలంగా పలు చోట్ల తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించుకొని రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఇదే క్రమంలో కుకునూరుపల్లి స్టేషన్ పరిధిలో 8 నెలల కిందట కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, కొడకండ్ల, కుకునూరుపల్లిల్లోని పలు ఇళ్లల్లో దొంగతనాలు చేశారన్నారు. ఈ మేరకు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారన్నారు. కోర్టులో జరిగిన విచారణలో వీరిద్దరే చోరీలు చేసినట్లుగా నిర్ధారణ కావడంతో మెజిస్ట్రేట్ ఈ కేసులో పై తీర్పునిచ్చారని తెలిపారు. నిందితులకు శిక్షపడేలా పని చేసిన సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్, కోర్టు పోలీస్ కానిస్టేబుల్ లోకేశ్‌తో పాటు మరికొందరిని అభినందించారు.

హైనా దాడిలో దూడ మృతి



చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో దూడ మృతిచెందిన ఘటన చిన్నకోడూరులో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రాపోలు సత్తిరెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద రోజూ మాదిరిగా దూడను కట్టేశాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లగా దూడ మృతిచెంది కనిపించింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ అక్కడకు చేరుకుని హైనా దాడిలో దూడ మృతి చెందినట్లు నిర్ధారించారు. గ్రామ రైతులు అప్రమత్తంగా ఉండాలని, కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవ్వరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

చిరుత కోసం బోన్ ఏర్పాటు


అనుమానిత ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోను

సిద్దిపేటఅర్బన్: చిరుత తన పిల్లలతో కలిసి సంచరించిన ప్రాంతంలో పాదముద్రల ఆనవాళ్లు గుర్తించేందుకు బుధవారం ఫారెస్టు అధికారులు గాలించారు. మండలంలోని బూరుగుపల్లిలో ఉన్న వ్యవసాయ బావుల వద్ద చిరుత తన పిల్లలతో కలిసి సంచరించిందనే సమాచారం మంగళవారం కలకలం రేపిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడక్కడ ఉన్న పాదముద్రల కొలతలు సేకరించారు. చిరుత పాద ముద్రల గుర్తులతో వాటిని విశ్లేషించి చూశారు అవి చిరుత పాదముద్రలా? కాదా? అని నిర్ధారణ కావడం లేదని, అనుమానిత ప్రాంతంలో పాడి మట్టి ఉండటం వల్ల గుర్తులు సరిగా లభ్యం కావడం లేదని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇక్రముద్దీన్ తెలిపారు. చిరుత కోసం ఆ ప్రాంతంలో బోను, ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పులి సంచరించే విషయం పూర్తిగా నిర్ధారణయ్యే వరకు గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్ఓ పద్మ, బీట్ ఆఫీసర్ చైతన్య, ఇతర అధికారులు ఉన్నారు.

చిన్నారులు కాదు చిచ్చర పిడుగులు

విభిన్న అంశాల్లో రాణిస్తున్న బాలబాలికలు | **నేడు బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేకం**

వారు చిచ్చర పిడుగులు. చదువుతో పాటు విభిన్న అంశాలను ఎంచుకొని రాణిస్తూ అందరి మన్నలు పొందుతున్నారు. తమ ప్రతిభను ప్రదర్శించి పలు వేదికల్లో పతకాలను పట్టారు. సాంకేతికతను అందిపుచ్చుకొని.. నెట్టింట రీల్స్ చేస్తూ ఫాలోవర్స్‌ను మైమరిపిస్తున్నారు. అంగవైకల్యం కూడా అభివృద్ధికి అడ్డు కాదంటూ రంగుల లోకంలో తమకంటూ ప్రపంచాన్ని సృష్టించుకుంటున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు.


హరి ప్రసాద్


నాగేశ్వరి

పంచ్ పడితే పతకమే

జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్, ఉషు విభాగంలో ఎంపిక

హత్నూర(సంగారెడ్డి): జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్, ఉషు విభాగంలో హత్నూర మండలం సిరిపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి మద్దూరి హరిప్రసాద్, ఎనిమిదో తరగతి విద్యార్థిని కాలే నాగేశ్వరి ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 4 వరకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 ఫైటింగ్ విభాగంలో హరి ప్రసాద్ బంగారు పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 9, 10 తేదీల్లో రంగారెడ్డి జిల్లా హస్తినాపూర్‌లో జరిగిన ఉషు అండర్-14 విభాగం రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో నాగేశ్వరి విజేతగా నిలిచింది. దీంతో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఇదే నెలలో పంజాబ్‌లో జరిగే పోటీలో కాలే నాగేశ్వరి, డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగే పోటీల్లో హరి పాల్గొననున్నారు.

యోగాసనాలు సునాయసంగా..


యోగాసనంలో సుమతి

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సుమతి. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాలనే బలమైన కోరికతో యోగా వైపు అడుగులు వేసేలా చేసింది. హిందీ మాస్టర్ విజయ్‌కుమార్ స్ఫూర్తితో ఆరవ తరగతి నుంచే రోజూ సాయంత్రం గంట వరకు యోగా సాధన చేస్తోంది. ప్రతీ వేసవి సెలవులలోనూ ఈ పాఠశాలలో యోగా ఉచిత క్యాంపు నిర్వహిస్తారు. దీంతో ఎంతటి కఠినమైన ఆసనాలను కూడా అవలీలగా వేస్తూ అందరితో ప్రశంసలు అందుకుంటుంది. ఈ నెల రెండో తేదీన అండర్ 17 విభాగంలో జరిగిన జిల్లా యోగా పోటీలో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ నెలలో 6, 7, 8వ తేదీల్లో వరంగల్‌లో జరిగే పోటీల్లో పాల్గొని అక్కడ కూడా సత్తా చాటి జాతీయస్థాయికి ఎంపికైంది. యోగాను ఒలింపిక్‌లో ప్రవేశపెడితే భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి దేశానికి గోల్డ్ మెడల్ సాధించి అమ్మ నాన్నలతో పాటు గ్రామానికి, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఉందని సాక్షితో వెల్లడించింది.

డ్యాన్స్ ఇరగదీస్తూ.. వేషధారణలో మెప్పిస్తూ ..


లవకుశ వేషాధారణలో


కూచిపూడి నాట్యం చేస్తున్న సహస్ర

దుబ్బాకటౌన్: చిన్న వయస్సు కళలతో మెప్పిస్తూ..ముందుకు సాగుతున్నారు. దుబ్బాక పట్టణానికి చెందిన 9 సంవత్సరాల వంగ సహస్ర... డ్యాన్స్ పోటీల్లో సత్తా చాటుతుంది. వెస్టర్న్.. క్లాసికల్ డ్యాన్స్‌లో భరత నాట్యం, కూచిపూడి నాట్యంలో సైతం ప్రతిభ కనబరుస్తుంది. జిల్లాలో నిర్వహించిన పలు పోటీలలో సత్తాచాటి పథకాలు గెలుచుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ సరస్వతి, లవకుశ , దుర్గ మాత, పార్వతి వేషధారణలో మెప్పిస్తుంది.

అడుగే ఆట.. నడకే నృత్యం


మెదక్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్‌లో శ్రీజ

పాపన్నపేట(మెదక్): మండలంలోని యూసుఫ్‌పేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది కోమలంచ శ్రీజ. ఇటు చదువుల్లోను.. అటు నృత్యం లోను మేటి కళాకారిణిగా రాణిస్తోంది. పాఠశాల టీచర్ పద్మ ప్రోత్సాహంతో తన ప్రతిభకు మెరుగులు దిద్దుకుంది. పాఠశాల స్థాయిలో ఎక్కడ సాంస్కృతిక పోటీలు జరిగినా తప్పకుండా పాల్గొని బహుమతి సాధిస్తుంది. ఇటీవల మెదక్‌లో జరిగిన యూత్ ఫెస్టివెల్ జిల్లా స్థాయి జానపద నృత్య పోటీల్లో ప్రథమ స్థానం పొందింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో సైతం తన డ్యాన్సుతో అదర గొట్టింది.


కరాటేలో విన్యాసం చేస్తున్న శ్రేయన్స్

బుడ్డోడు.. కరాటేలో గట్టోడు

దుబ్బాకటౌన్: ఆరు సంవత్సరాల వయసులోనే ... బుడ్డోడు కరాటేలో ప్రతిభ చూపుతున్నాడు. దుబ్బాక పట్టణానికి చెందిన శ్రేయన్స్ ఋషి విద్యాలయంలో యూకేజీ చదువుతున్నాడు. కరాటే పై ఇష్టంతో మాస్టర్ బురాని శ్రీకాంత్ వద్ద విద్య నేర్చుకుంటున్నాడు. వయసును లెక్క చేయకుండా కరాటేలో లెగ్ స్ట్రెచ్, ఫ్రంట్ కిక్, స్ట్రెయిట్ కిక్ , సైడ్ కిక్ ఇలా పలు విన్యాసాలు చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నాడు. జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్‌లో పాల్గొంటున్నాడు.

సోదితో మెప్పించి.. బహుమతి సాధించి


విచిత్ర వేషధారణలో హర్షిత

చిన్నశంకరంపేట(మెదక్): సోది చెబుతానమ్మ సోది చెబుతానంటూ... కథల పోటీలలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. చిన్నశంకరంపేట మండలం రుద్రారానికి చెందిన హర్షిత. చందంపేట ఉన్నత పాఠశాల పదవ తరగతి చదువుతోంది. రెండు రోజుల పాటు హైదారాబాద్‌లో నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో యువతపై మాదకద్రవ్యాల ప్రభావం-నివారణ కోసం పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రహరీ క్లబ్‌ల ఆవశ్యకత, జీవన నైపుణ్యాలను మెరుగు అనే అంశాలపై సోది చెప్పింది. స్టోరీ టెల్లింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటి జాతీయస్థాయికి ఎంపికైంది.

రీల్స్‌తో.. రప్ఫాడిస్తున్న శివరాంసాయి



సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణానికి చెందిన 12 ఏళ్ల శివరాంసాయి. స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. గతేడాదిన్నరగా సోషల్ మీడియాలో సిద్దిపేట చిచ్చా పేరిట శివరాం సాయి తన రీల్స్ ద్వారా ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటి వరకు ఇన్‌స్టాలో సిద్దిపేట చినోళ్లు పేజీ పేరిట చేస్తున్న రీల్స్‌కు 30 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. యూట్యూబ్‌లోను ఆదరణ ఉంది. సిద్దిపేట పట్టణంలో వ్యాపార, వాణిజ్య సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా రీల్స్ చేస్తున్నాడు. హోటల్స్, బిర్యానీ పాయింట్లు, షాపింగ్ మాల్స్, వివిధ రకాల దుకాణాలకు తన రిల్స్ ద్వారా ప్రకటనలు చేస్తున్నాడు.

గ్లోబల్ స్థాయిలో సత్తా



జిన్నారం (పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలో బొల్లారం మున్సిపల్ పరిధిలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న గవ్వర లాస్య విశ్వవేదికపై మెరిసింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం గురువుల మార్గదర్శకత్వంలో గత నెలలో జరిగిన ఇంటర్ జనరేషన్ గ్లోబల్ ఈవెంట్ నాలెడ్జి కేఫ్ 2024 ఎంపికై అందరి ప్రశంసలు అందుకుంది. విశ్వ వేదికపై వర్చువల్ గా నిర్వహించిన ఐదు దేశాల విద్యార్థులతో పోటీపడి సత్తా చాటింది. 120 నిమిషాల పాటు మూడు రౌండ్లలో మేథో ప్రతిభ కనబరిచింది.

చిత్రలేఖనానికి... చిన్నబోయిన వైకల్యం


వివేకవర్ధిని

దుబ్బాకటౌన్: అంగవైకల్యం ప్రతిభకు అడ్డు రాదని నిరూపించింది దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన కోమటిరెడ్డి వివేకావర్ధిని. చిత్రలేఖనంలో రాణిస్తూ అందరితో శభాష్ అనిపించుకుంటుంది. దుబ్బాక మున్సిపల్ లచ్చపేటలో 10 వ తరగతి చదువుతోంది. ఒంటి చేతితోనే అందమైన బొమ్మలను గీస్తూ సామాజిక సందేశాన్ని అందిస్తోంది. పుట్టుకతోనే ఒక చేయి లేదు. అయినా మొక్కవొని మనోధైర్యంతో కుంచెతో సమాజంలోని రుగ్మతలపై బొమ్మలు వేసి జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. కేంద్ర ప్రభుత్వం యేటా నిర్వహించే కళోత్సవ్‌లో గీసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

శిశు సంరక్షణకే ప్రాధాన్యం



సంగారెడ్డిజోన్: బాలల హక్కుల కోసం సంరక్షణ కేంద్రాలు వారి రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. జిల్లాలో ఉన్న అనాధ పిల్లలు, నిరాధారణకు గురైన పిల్లలను శిశు గృహ, బాలసదనాల ద్వారా సంరక్షణ చర్యలు చేపట్టింది. గుర్తు తెలియని 6 సంవత్సరాల లోపు శిశువుల సమాచారం తెలిస్తే వెంటనే బాలరక్షక్ వాహనాల ద్వారా వెళ్లి రిస్క్యూ చేస్తున్నాం. ఏడు నుంచి 18 సంవత్సరాల వయసు లోపు ఉన్న నిరాధారణకు గురైన అనాధ బాలలకు రక్షణ, భద్రత కోసం బాలసదనానికి పంపిస్తున్నాం. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు 11 మంది రెస్క్యూ చేశాం. 18 మందిని దత్తత ఇచ్చాం. –లలిత కుమారి, జిల్లా మాతా శిశు సంరక్షణ శాఖ అధికారి

బాలకార్మికుల వ్యవస్థను రూపుమాపుదాం



సంగారెడ్డిటౌన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరిపై ఉంది. బాలల దినోత్సవం అంటే కేవలం వేడుక చేసుకోవడమే కాదు కాకుండా పిల్లలకు విలువల గురించి తెలియజెప్పాలి. వారితో పని చేయిస్తే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పిల్లలు ఆటపాటలతో పాటు చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగాయి. పిల్లలు సెల్ ఫోన్లు ఎక్కువగా వాడుతున్నారు ఈక్రమంలో సైబర్ నేరాలపై అవగాహన అవసరం. పిల్లలు, పెద్దలకు ఎవరికైనా మా వంతుగా ఉచిత న్యాయ సహాయం, సలహాలను అందజేస్తాం. –రమేశ్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి

తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం

- చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుటే డీజిల్ పోసుకున్న పరిస్థితి
- తేరుకొని అడ్డుకున్న పోలీసులు
- భూమి తగాదా విషయమై పలుమార్లు పిలిపించిన ఎస్ఐ
- పూర్వీకుల ఆస్తి విషయమై అన్న యాదయ్య ఫిర్యాదు


ఆత్మహత్యాయత్నం చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): పోలీస్‌స్టేషన్ ఎదుట తండ్రి, కొడుకులు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలో బుధవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన తండ్రీకొడుకులు అవుశర్ల సత్యనారాయణ, అవుశర్ల వెంకటేశ్‌లు తమ పూర్వీకుల నుంచి సంక్రమించాల్సిన భూమికి సంబంధించి తలెత్తిన తగాదా విషయంలో అధికార పార్టీ నాయకులు కలుగజేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు రప్పించి కేసులు నమోదు చేయిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయమై తీవ్ర మనస్తాపం చెంది పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై డీజిల్ పోసుకున్నారు. వెంటనే తేరుకున్న పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి విడిలిపెట్టారు. ఈ విషయమై ఎస్ఐ నీరేష్‌ను వివరణ కోరగా.. సత్యనారాయణ అన్న అవుశర్ల యాదయ్య ఈ నెల 11న ఫిర్యాదు ఇచ్చాడన్నారు. ఈ విషయమై మాట్లాడెందుకు సత్యనారాయణ, వెంకటేష్‌లను స్టేషన్‌కు పిలిచానన్నారు. మాట్లాడిన అనంతరం భూ తగాదాలు సివిల్ కోర్టులో తేల్చుకోవాలని, ఒకరి భూమిలోకి మరొకరు వెళ్లి తప్పు చేస్తే కేసు నమోదు చేయాల్సి వస్తుందని చెప్పి పంపించానన్నారు. కానీ వారు స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారన్నారు. ఇందులో పోలీసుల ప్రమేయం ఏమీ లేదన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బానోతు రాజన్న

- 20 మంది విద్యార్థులకు ఒక కేర్ టేకర్, ప్రత్యేక స్టడీ అవర్స్
- జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న
- విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్పొరేట్‌కు దీటుగా విద్యబోధన అందిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న అన్నారు. జగదేవపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని చెప్పారు. ప్రత్యేక తరగతులు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని, వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శద్ధ వహిస్తున్నామని తెలిపారు. ఎంసెట్ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక కేర్ టేకర్ ఉంటారని, వారి బాగోగులను చూసుకుంటారన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులుగా కూడా శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం సమాజంలో అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని ఇంటర్‌లోనే సరైనా మార్గం ఎంచుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ఉద్ఘాటించారు. ఇంటర్‌లో జాగ్రత్తగా చదివి పాసైన వారు ఉన్నత చదువులు చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలు దగ్గర్లో ఉన్నాయని, వారిని దగ్గరుండి చదివించాలని, మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. సమావేశంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొనాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను, కళాశాల బృందాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

చెట్లపొదల్లో పసికందు

- దుద్దెడ శివారులో హృదయవిదారకర ఘటన
- మాజీ సర్పంచ్ చొరవతో ఆస్పత్రికి తరలింపు


పసిబిడ్డను ప్రభుత్వ ఆస్పత్రిలో అప్పగిస్తున్న 108 సిబ్బంది

కొండపాక(గజ్వేల్): పుట్టిన బిడ్డను కవర్లో కట్టి చెట్ల పొదల్లో వదిలివేసిన హృదయ విదారకర ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ శివారులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుద్దెడ నుంచి దర్గా గ్రామానికి వెళ్లే దారిలో చెట్ల పొదల మధ్య పసికందు ఏడుపులను ఈ ప్రాంతంలోని పశువులను మేపుతున్న కాపరులు విన్నారు. గ్రామస్తులకు సమాచారం అందించగా మాజీ సర్పంచ్ మహాదేవ్‌తో పాటు దరు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పసికందు చెట్ల పొదల్లోంచి బయటకు తీసి ముక్కు కింది భాగంలో రక్తం కారుతుండటంతో శుభ్రం చేశారు. అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మహేందర్, రమేశ్‌లు కాల్ సెంటర్ ద్వారా వైద్యుడి సలహాల మేరకు శిశువుకు ప్రథమ చికిత్స అందించారు. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి డ్యూటీ వైద్యురాలు గ్రీష్మకు అప్పగించినట్లు అంబులెన్సు సిబ్బంది పేర్కొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

పటాన్‌చెరు టౌన్: ఎండు గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం... పటాన్‌చెరు మండలం ఘనాపూర్‌లో, పటాన్‌చెరులో ఉన్న వాల్యూ జోన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం బుధవారం ఎక్సైజ్ పోలీసులకు అందింది. దీంతో తనిఖీలు నిర్వహించి ఘనపూర్‌లో ముగ్గురు, పటాన్‌చెరులో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6.03 కిలోల ఎండు గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.